# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (GFF) 2026ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం ప్రారంభించారు.

❖ సూరత్ - బిలిమోరా స్టేషన్ల మధ్య భారతదేశపు మొట్టమొదటి బుల్లెట్ రైలు సేవలు 2027లో అందుబాటులోకి రానున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

❖ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

❖ అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్చరీ పారా సిరీస్ స్టేజ్-3లో భారత్ మొత్తం రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి ఐదు పతకాలు సాధించింది.

========================

గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (GFF) 2026ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబైలో కొద్దిసేపటి క్రితం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఆవిష్కరణలు, ఆర్థిక సమ్మిళితత్వాన్ని కేంద్రంగా చేసుకుని భారత్ తన ఫిన్‌టెక్ ప్రయాణాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తోందన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌కు భారతదేశంతో పాటు విదేశాల నుంచి హాజరైన అతిథులు, ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ఫిన్‌టెక్ రంగానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో ఇది తెలియజేస్తుందని నరేంద్ర మోదీ అన్నారు. ఏజెంటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను విశ్వసనీయ, అనుసంధానిత, ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఈ ఏడాది ఫిన్‌టెక్ ఫెస్ట్ ప్రధానంగా చర్చించనుంది.

========================

గుజరాత్‌లోని వడోదరలో 35 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించి, మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా `వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (WDFC)`లోని మూడు కీలక సెక్షన్లను ఈరోజు జాతికి అంకితం చేశారు. దీంతో దేశంలోని డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ నెట్‌వర్క్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి.. కార్యకలాపాలు ప్రారంభమైనట్లయింది. అనంతరం బహిరంగ సభనుద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ.. భారతదేశ రవాణా, లాజిస్టిక్స్ రంగం వేగంగా రూపాంతరం చెందుతోందన్నారు. 2,800 కిలోమీటర్లకు పైగా డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ల నిర్మాణం పూర్తికావడం 21వ శతాబ్దపు భారతదేశానికి చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. సరకు రవాణా రైళ్లను ప్రయాణికుల రైళ్ల మార్గాల నుంచి వేరు చేయడం ద్వారా రవాణా సామర్థ్యం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సామాజిక సేవ, పరిశుభ్రతను నిత్య జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చివరి మైలు వరకు చేరేలా చూడాలని సూచించారు. గుజరాత్ లోని నవ్‌సారిలో నూతనంగా నిర్మించిన భారతీయ జనతా పార్టీ  కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ఈరోజు ప్రసంగించారు. ప్రధానమంత్రి స్వనిధి పథకం పరివర్తనాత్మక ప్రభావాన్ని ప్రస్తావించిన నరేంద్రమోదీ, చిన్న వీధి వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులకు సులభంగా అందుబాటులో ఉండే సరసమైన రుణాలు, ఆధునిక డిజిటల్ చెల్లింపు సదుపాయాల ద్వారా ఆర్థిక సమ్మిళితత్వం కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో మొట్టమొదటి బుల్లెట్ రైలు పరుగులు పెట్టేందుకు సిద్ధమవుతోందని రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గుజరాత్ లోని వడోదరలో ఈ రోజు జరిగిన 'నమో ఘర్  వికసిత్ భారత్' సభ లో ఆయన మాట్లాడుతూ... భారతదేశపు మొట్టమొదటి హై-స్పీడ్ రైలు ప్రాజెక్ట్ ముంబై-అహ్మదాబాద్ (MAHSR) కారిడార్ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాబోయే కొన్ని నెలల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కీలకమైన మైలురాయిని చేరుకుంటుందని తెలిపారు. సూరత్-బిలిమోరా స్టేషన్ల మధ్య బుల్లెట్ రైలు సేవలను 2027లో అందుబాటులోకి రానున్నట్లు మంత్రి ప్రకటించారు. 508 కిలోమీటర్ల మేర ఉన్న ముంబై-అహ్మదాబాద్ కారిడార్‌లో ఈ సెక్షనే తొలుత ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. వాపి-సూరత్ విభాగంలో హైస్పీడ్ కారిడార్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి అవుతాయని వెల్లడించారు. బుల్లెట్ రైలులోని మొదటి కోచ్ ఇప్పటికే తయారైందని, వచ్చే ఏడాది మే నెలలో ట్రయల్ రన్ కోసం దీనిని పట్టాలపైకి తీసుకురానున్నట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

72వ జాతీయ చలనచిత్ర అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 22వ తేదీన గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో ప్రదానం చేయనున్నారు. ఈ ఏడాది అవార్డులు వివిధ భాషలు, కథాంశాలు, సినిమా రూపాల్లోని వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ అవార్డుల్లో 'ఆర్టికల్ 370' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా ఎంపికైంది. 'భంగార్' ఉత్తమ నాన్-ఫీచర్ ఫిల్మ్‌గా, 'రామ్-నామీ' ఉత్తమ డాక్యుమెంటరీగా నిలిచాయి. మలయాళ చిత్రం 'భ్రమయుగం'లో ఉత్తమ నటనకు గానూ మమ్ముట్టి, 'చందూ ఛాంపియన్' చిత్రంలోని నటనకు కార్తీక్ ఆర్యన్‌లు ఉత్తమ నటుడి అవార్డుకు ఎంపికయ్యారు. 'ఆర్టికల్ 370' చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' చిత్రానికి దర్శకత్వం వహించిన రణదీప్ హుడాకు ఉత్తమ తొలి దర్శకుడి అవార్డు లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-చైనా సరిహద్దులో కమాండర్ స్థాయి సమావేశాలు జరిగాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్–చైనా సరిహద్దు నిర్వహణలో భాగంగా తొలి సీనియర్ హయ్యెస్ట్ మిలిటరీ కమాండర్ స్థాయి ఫ్లాగ్ సమావేశం ఈ నెల 6వ తేదీన అరుణాచల్‌ప్రదేశ్‌లోని భారత భూభాగంలోని వాచా వద్ద జరిగిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. చైనా వైపు దమైలో నిన్న మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... 2025 ఆగస్టు, 2026 ఆగస్టులో భారత్, చైనా ప్రత్యేక ప్రతినిధుల మధ్య కుదిరిన అవగాహనలకు అనుగుణంగా ఈ కమాండర్ స్థాయి సమావేశాలు నిర్వహించినట్లు జైస్వాల్ వివరించారు. అదే విధంగా `బ్రిక్స్ సదస్సు` సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారని జైస్వాల్ తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణపై స్పందిస్తూ.. ద్వైపాక్షిక చర్చల్లో ప్రస్తావనకు రానున్న అనేక అంశాల్లో ఈ సమస్య కూడా ఒకటని రణదీర్ జైస్వాల్ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఐటీఐ క్లస్టర్ల అభివృద్ధి కోసం మొత్తం 735 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో కూడిన పెట్టుబడి ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్ గ్రేడెడ్ ఐటీఐస్ (PM-SETU) పథకం కింద నిర్వహించిన 5వ నేషనల్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజస్థాన్ ఐటీఐ క్లస్టర్లకు 241 కోట్ల రూపాయలు, ఉత్తరప్రదేశ్‌కు 240 కోట్ల రూపాయలకు పైగా, తెలంగాణ ఐటీఐ క్లస్టర్లకు 254 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడి ప్రణాళికలకు ఆమోదం లభించింది. ఈ తాజా ఆమోదాలతో PM-SETU కింద దేశంలోని 9 ఐటీఐ క్లస్టర్లకు మంజూరైన మొత్తం పెట్టుబడి 2,171 కోట్ల రూపాయలకు చేరిందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్చరీ పారా సిరీస్ స్టేజ్-3లో చివరి రోజుకు ముందు జరిగిన పోటీల్లో భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. భారత్ మొత్తం రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి ఐదు పతకాలు సాధించింది. పురుషుల జట్లు రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నాయి. పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ తోమన్ కుమార్, శ్యామ్ సుందర్ స్వామి స్వర్ణ పతకం సాధించారు. ఇక పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో డబుల్ పారాలింపిక్ పతక విజేత హర్విందర్ సింగ్, విజయ్ సుందీ జోడీ కూడా స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే రెండు రోజుల్లో దేశంలోని ఈశాన్య ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) అంచనా వేసింది. అలాగే అండమాన్ నికోబార్ దీవులు, బీహార్, ఒడిశా, ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం, తెలంగాణలో ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =